## క్లుప్తంగా

### పెద్దమ్మ గుడిలో చోరీ

అల్లాదుర్గం(మెదక్): మండలంలోని రాంపూర్ గ్రామ శివారులో 161 జాతీయ రహదారి పక్కన ఉన్న పెద్దమ్మ గుడిలో గురువారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. అమ్మవారి విగ్రహానికి ఉన్న రెండు తులాల వెండి కళ్లను తొలచి దొంగలు ఎత్తుకెళ్లి పోయినట్లు చెప్పారు. పెద్దమ్మ గుడి నూతనంగా నిర్మిస్తుండటంతో చిన్న గుడిలో అమ్మవారిని ప్రతిష్టించి భక్తులు కొలుస్తున్నారు. దొంగలు ఇదే అదనుగా భావించి అమ్మవారి గుడిలో చోరీకి పాల్పడినట్లు గ్రామస్తులు వివరించారు. గతంలో హుండీని సహితం దొంగలు ఎత్తుకుపోయిన్నారన్నారు.

### ఉచిత వైద్య శిబిరం


పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

తూప్రాన్: పట్టణ పరిధిలోని టోల్‌ప్లాజా సమీపంలోని బాలుర గురుకుల పాఠశాలలో జీఎమ్మార్ వరలక్ష్మి ఫౌండేషన్, సీఎంఆర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని జీఎమ్మార్ హైవే లిమిటెడ్ ప్రాజెక్ట్ మేనేజర్ వెంకటరమణ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. వైద్య పరీక్షల అనంతరం అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ మేనేజర్ వెంకటరమణ, ఫౌండేషన్ ప్రోగ్రామ్ ఎగ్జిక్యూటివ్ శ్రీనివాస్, సిబ్బంది సతీశ్ కుమార్ పట్నాయక్, పాఠశాల హెడ్‌మాస్టర్ మురళీ, పాఠశాల సిబ్బంది, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

### టై బెల్టులు పంపిణీ


టై, బెల్టులు అందిస్తున్న సర్పంచ్

పాపన్నపేట(మెదక్): మండలంలోని ఎల్లాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి సొంత ఖర్చులతో టై, బెల్టులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాజయ్య, టీచర్లు అంబికా, సోని, వసంత, సంగీత పాల్గొన్నారు.

### ఈకేవైసీ కోసం తిప్పలు


శివ్వంపేటలో క్యూలో పెట్టిన చెప్పలు

శివ్వంపేట(నర్సాపూర్): గ్యాస్ ఈకేవైసీ కోసం కాలపరిమితి ఏమి లేదని అధికారులు చెబుతున్నా.. లబ్ధిదారులు అవేవి పట్టించుకోక ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం మండల కేంద్రం శివ్వంపేటలోని వెంకటరమణ భారత్ గ్యాస్ ఏజెన్సీ వద్ద ఈకేవైసీ చేయించుకునేందుకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన లబ్ధిదారులను తెల్లవారుజామును నుంచే క్యూలైన్‌లో ఉన్నారు. క్యూలైన్ కోసం చెప్పులు పెట్టి ఈకేవైసీ చేయించుకొని ఇళ్లకు వెళ్లారు.

### వ్యవసాయ రంగంలో మార్పులు


మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి రాజ్‌నారాయణ

రామాయంపేట(మెదక్): వ్యవసాయ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు వస్తున్నాయని మండల వ్యవసాయ అధికారి రాజ్‌నారాయణ అన్నారు. శుక్రవారం ఆయన మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు వ్యవసాయ రంగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వ్యవసాయ రంగంలో వస్తున్న నూతన సాంకేతిక అంశాలను, ఉపాధి అవకాశాలను అంది పుచ్చుకోవాలని సూచించారు. పంట విత్తన దశ నుంచి కోత వరకు రైతుల శ్రమ, ఖర్చు, పెట్టుబడులు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### క్రిస్మస్ వేడుకలు

నర్సాపూర్ రూరల్: మండలంలోని నాగులపల్లి సీఎస్ఐ చర్చిలో శుక్రవారం సాయంత్రం ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రెస్ బీటర్ రెవరెండ్ సురేశ్ మాట్లాడారు. కార్యక్రమంలో రమేశ్, దాస్, పవన్, ప్రభాకర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.


రామాయంపేటలోని పాఠశాలలో రామానుజన్ చిత్రపటానికి నివాళులర్పించిన టీచర్లు


చండూర్‌లో విద్యార్థులు తయారు చేసిన గణిత పరికరాలను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు


పాపన్నపేట(మెదక్): మాట్లాడుతున్న హెచ్‌ఎం మహేశ్వర్

# విద్యార్థులకు రామానుజన్ ఆదర్శం

జిల్లా వ్యాప్తంగా గణిత దినోత్సవం

జిల్లా వ్యాప్తంగా శుక్రవారం జాతీయ గణిత శాస్త్ర దినోత్సవం జరుపుకొన్నారు. ఆయా గ్రామాల్లో గణిత శాస్త్ర పితామహుడు రామానుజన్ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటాల వద్ద నివాళులర్పించారు. అలాగే పాఠశాలల ఆవరణలో విద్యార్థులు మ్యాథ్స్ సింబల్ వేశారు. విద్యార్థులకు ఆయన ఆదర్శప్రాయుడని పలువురు వక్తలు అన్నారు. పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ఉన్నారు.


పెద్దశంకరంపేట(మెదక్): ప్రదర్శనలను పరిశీలిస్తున్న ఎంపీపీ శ్రీనివాస్


నర్సాపూర్ రూరల్: విష్ణు హైస్కూల్లో విద్యార్థులతో ఉపాధ్యాయులు



నిజాంపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మ్యాథ్స్ సింబల్ వేసిన విద్యార్థులు


మనోహరాబాద్(తూప్రాన్): గణిత చిత్రాలను చూపుతున్న విద్యార్థులు

## కరోనాపై ప్రజలను అప్రమత్తం చేయాలి

మండల సమావేశంలో ఎంపీపీ మంజుల

కొల్చారం(నర్సాపూర్): కరోనా మరోసారి ప్రభలుతున్న తరుణంలో ఆరోగ్య సిబ్బంది ప్రజా ప్రతినిధులు తమ వంతుగా ప్రజలను అప్రమత్తం చేయాలని ఎంపీపీ మంజుల సూచించారు. శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు తమ నివేదికలను సభ్యులకు చదివి వినిపించారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లు వీరారెడ్డి, రాంరెడ్డి మాట్లాడుతూ.. ఎనగండ్ల, రాంపూర్ గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద విద్యుత్ సమస్యలు ఉన్నాయని అధికారులకు సమాచారం ఇచ్చిన స్పందించడం లేదంటూ ట్రాన్స్‌కో ఏఈపై


మాట్లాడుతున్న ఎంపీపీ మంజుల

ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎనగండ్ల భగీరథ నీరు సరఫరా కావడంలేదని సర్పంచ్ ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీకాంత్ దృష్టికి తీసుకువచ్చారు. సమావేశంలో పంచాయతీరాజ్ ఏఈ ఇర్ఫాన్ , పీహెచ్‌సీ వైద్యాధికారి రమేశ్, ఎంపీపీ ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి ఎంపీడీఓ గణేశ్‌రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## అయ్యప్పస్వామి విగ్రహం శోభాయాత్ర

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల కేంద్రంలో అయ్యప్ప స్వాముల ఆధ్వర్యంలో ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకొని అయ్యప్పస్వామి, గణపతి, సుబ్రహ్మస్వామి విగ్రహాల శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా గురుస్వామి కృష్ణమూర్తి.. మాట్లాడుతూ.. అయ్యప్ప భక్తి సమాజం ఆధ్వర్యంలో అయ్యప్పస్వాములకు అందుబాటులో పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. గురుస్వామి శ్రీనివాస్, ప్రభాకర్, అమరేందర్, కృష్ణస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఫార్మ్‌ల్యాండ్ అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

రేగోడ్ మండల సమావేశంలో సభ్యులు

రేగోడ్(మెదక్): మండలంలో లక్కీ బ్రో అనే కంపెనీ పేరుతో అక్రమంగా ఫార్మ్‌ల్యాండ్ బిజినెస్ నడుస్తుందని, దీనిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ శ్రీకాంత్ నాయక్ డిమాండ్ చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ సరోజన అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ డాక్టర్ శ్వేత మాట్లాడుతూ.. కరోనా జేఎన్1 వేరియంట్‌పై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. 13వ ప్రజావేదిక ఆడిట్‌లో జరిగిన పనులపై పీఆర్ శాఖకు సంబంధించిన నివేదిక ఎందుకు సమర్పించలేదని ఎంపీడీఓ సీతారావమ్మ పీఆర్ ఏఈ ఈశ్వర్ నాయక్‌ను ప్రశ్నించారు.


పీఆర్‌ఏని ప్రశ్నిస్తున్న ఎంపీడీఓ సీతారావమ్మ

పోచారం పాఠశాలలో ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదని సర్పంచ్ సునీల్ కుమార్ ప్రశ్నించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ యాదగిరి, వైస్ ఎంపీపీ వినీల, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి రూ. 3 లక్షల ఆదాయం


వేలం పాట నిర్వహిస్తున్న సిబ్బంది

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని సికింద్లాపూర్ లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి రూ.3 లక్షల 38 వేల ఆదాయం సమకూరింది. ఆలయం వద్ద ప్రసాదాలు, కొబ్బరికాయల విక్రయాల కోసం శుక్రవారం బహిరంగా వేలంపాట నిర్వహించారు. ఈ సందర్భంగా సంవత్సరం పాటు కొబ్బరికాయల అమ్మకం కోసం గోమారం గ్రామానికి చెందిన గంగిరెడ్డి నవీన్‌రెడ్డి రూ.లక్ష 78 వేలు, ప్రసాదాల అమ్మకం కోసం బీరంగూడకు చెందిన విశ్వనాథం రూ. లక్ష 60 వేలకు వేలం పాటలో దక్కించుకున్నారు.

**హుండీ ద్వారా రూ.3 లక్షలు**

భక్తుల సమక్షంలో ఆలయ హుండీ శుక్రవారం లెక్కించారు. 9 నెలలకు సంబంధించి ఆలయ హుండీ ఆదాయం రూ.3 లక్షల 12 వేల 105 రూపాయలు వచ్చినట్లు ఈఓ శశీధర్‌గుప్తా తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ పరిశీలకులు రంగారావు, సర్పంచ్ ఏనుగు సుధాకర్‌రెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు ధనుంజయ్‌శర్మ, ఎంపీటీసీ నర్సింహరెడ్డి, ఉప సర్పంచ్ నర్సింలు, సీనియర్ అసిస్టెంట్ నర్సింహరెడ్డి, అర్చకులు విద్యాకర్‌చారి, తదితరులు ఉన్నారు.

### పాత వాటర్ ప్లాంట్‌కు కొత్త పూతలు

నర్సాపూర్ రూరల్: పాత వాటర్ ప్లాంట్‌కు కొత్త పూతలు వేసి ప్రచారం చేసుకుంటున్నారని మండలంలోని కాగజ్ మద్దూర్ మాజీ సర్పంచ్ శంకరయ్య ఆరోపించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. కాగజ్ మద్దూర్‌లో ఇటీవల సర్పంచ్‌తో పాటు కొంత మంది కలిసి గతంలో ఉన్న పాత వాటర్ ప్లాంట్‌కు కొత్తపేరు పెట్టి శిలాఫలకం పెట్టి ప్రారంభించినట్లు ప్రచారం చేస్తున్నారన్నారు. 2014లో దాతల సహకారంతో తాను సర్పంచ్‌గా ఉన్నప్పుడు వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసే రూ. 2కే 20 లీటర్ల నీరు అందించమన్నారు. గ్రామసభ ఏర్పాటు చేయకుండా ప్రస్తుత పాలకవర్గం సభ్యులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ గ్రామాన్ని అభివృద్ధి చేసినట్లు చెప్పుకోవడం దురదష్టకరమన్నారు.

### నేడు సాయిబాబా ఆలయ వార్షికోత్సవం


ఆలయంలో సాయిబాబా

నర్సాపూర్ రూరల్: నర్సాపూర్ పట్టణంలోని ఎన్జీఓ కాలనీలో కొలువుదీరిన సాయిబాబా ఆలయ వార్షికోత్సవం శనివారం నిర్వహిస్తున్నట్లు భక్తులు శుక్రవారం తెలిపారు. ఉదయం అభిషేకం, హోమం, సాయి వ్రతాలతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారన్నారు. మధ్యాహ్నం అన్న ప్రసాదం, సాయంత్రం పల్లకి సేవ, భజన కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు.

### నేడు అయోధ్య అక్షింతల వితరణ

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంటలో అయోధ్య రామమందిర అక్షింతల వితరణ శనివారం నిర్వహిస్తున్నట్లు వీహెచ్‌పీ జిల్లా సహ కార్యదర్శి ప్రభాకర్‌జీ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం మధ్యాహ్నం చేగుంట హనుమాన్ దేవాలయం నుంచి కన్యకపరమేశ్వరీ ఆలయం వరకు అక్షింతల కలషాలు ఊరేగిస్తామన్నారు. అనంతరం ఆయా గ్రామాల బాధ్యులకు అక్షింతలను అప్పగించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజలు, ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

### ట్రాన్స్‌ఫార్మర్ షిఫ్టింగ్‌కు దరఖాస్తులు

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలో నిర్వహించిన విద్యుత్ వినియోగదారుల సదస్సులో రెండు దరఖాస్తులు వచ్చినట్లు ట్రాన్స్‌కో మండల అధికారి సతీష్‌బాబు తెలిపారు. శుక్రవారం మండల విద్యుత్ శాఖ కార్యాలయంలో నిర్వహించిన వినియోగదారుల సదస్సులో మండల కేంద్రంలోని త్రిమూర్తి రైస్‌మిల్ వెనకాల తమ సొంత స్థలంలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను షిఫ్ట్ చేయాలని తుమ్మ గంగమణి దరఖాస్తు అందించారు. అలాగే రుద్రారం గ్రామానికి చెందిన సిద్ధిరాములు తమ ఇంటి బిల్లు పది వేల పైన వచ్చిందని, తగ్గించాలని కోరుతూ దరఖాస్తు అందించారు.

### పూలే జయంతిని అధికారికంగా నిర్వహించాలి


మంత్రికి వినతిపత్రం అందిస్తున్న అశ్విని

రామాయంపేట(మెదక్): సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించాలని కోరుతూ సావిత్రిబాయి పులే సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు మహాదేవి, జిల్లా అధ్యక్షురాలు పోచమ్మల అశ్విని శుక్రవారం బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు తాము మంత్రిని హైదరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేయగా, ఆయన సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. సంఘం నాయకులు వారివెంట ఉన్నారు.

## ముక్కోటి ఏకాదశికి సర్వం సిద్ధం


ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు చేస్తున్న భక్తులు


ముస్తాబైన రంగంపేట రంగనాయక ఆలయం

అల్లాదుర్గం(మెదక్): మండలంలో శనివారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ఏర్పాట్లు చేశారు. అల్లాదుర్గం, గడిపెద్దాపూర్ వెంకటేశ్వర ఆలయాలను ఏకదాశి సందర్భంగా ముస్తాబు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా ఆలయ కమిటీ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

వెల్దుర్తి(తూప్రాన్): వైకుంఠ ఏకాదశి సందర్భంగా శనివారం లక్ష్మీనర్సింహ స్వామి ఉత్తర ద్వార దర్శనం వైభవంగా నిర్వహించేందుకు హస్తాల్‌పూర్ గ్రామశివారులోని ఆలయంలో నిర్వాహకులు ముమ్మర ఏర్పాట్లు చేశారు. ముక్కోటిని పురస్కరించుకొని వేకువజామున 5 నుంచి స్వామివారి ఉత్తర ద్వార దర్శన భాగ్యాన్ని కల్పించనున్నారు. ఈ సందర్భంగా గణపతిపూజ, పుణ్యాహవచనం, అఖండ దీప స్థాపన, నవగ్రహ పూజ, నర్సింహస్వామి అభిషేకం, ఉత్తర ద్వార దర్శనం, ఆంజనేయస్వామికి సింధూర అలంకరణ, ఆకు పూజ వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం అన్నప్రసాద వితరణ చేపట్టనున్నట్లు వెల్లడించారు.


కౌడిపల్లి: వేంకటేశ్వరస్వామి ఆలయంలో ..

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్నలోని శ్రీరాయగిరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులకు ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు గ్రామ పురోహితుడు మెట్టురాములుశర్మ, ఆలయభక్త భజన మండల సభ్యులు తెలిపారు.

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని వైష్ణవాలయాలు ముస్తాబయ్యాయి. రంగంపేటలోని రంగనాయక స్వామి దేవాలయంతో పాటు సంగాయిపేటలోని వెంకటేశ్వర గుట్ట ముక్కోటి ఏకాదశికి సిద్ధమయ్యాయి.

### పటిష్ట పోలీసు బందోబస్తు

మెదక్ పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్

మెదక్ మున్సిపాలిటీ: వైకుంఠ ఏకాదశి (ముక్కోటి ఏకాదశి) పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణంలో పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు మెదక్ పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్ తెలిపారు. శనివారం వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని ఆయన మాట్లాడుతూ.. మెదక్ పట్టణంలోని వేంకటేశ్వర స్వామి ఆలయం, కోదండ రామాలయంలో ఉదయం 4 నుంచి పూజలు ప్రారంభమవుతాయని పోలీసు శాఖ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

## వైభవంగా గీతా మందిరంలో పూజలు

తూప్రాన్: పట్టణంలోని గీతా మందిరంలో శుక్రవారం వైకుంఠ (ముక్కోటి)ఏకాదశి, గీతా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తర ద్వార పూజ, శ్రీగోపాల కృష్ణస్వామి దర్శనం, భగవద్గీత పారాయణం, హోమం, పూర్ణహుతి, సామూహిక శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం తదితర పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.


పూజలు నిర్వహిస్తున్న భక్తులు

## ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలి


యావపూర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న ఆటో డ్రైవర్లు

తూప్రాన్: ప్రభుత్వం ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని మండలంలోని యావపూర్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద తూప్రాన్ – గజ్వేల్ రహదారిపై శుక్రవారం ఆటో డ్రైవర్లు నిరసన తెలిపారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడం కారణంగా ఆటో డ్రైవర్లకు ఉపాధి కరువైందని అన్నారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లు మాట్లాడుతూ.. ఆర్టీసీ బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణించడం ద్వారా తమకు గిరాకీ లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. ఉపాధి లేక ఆటో ఫైనాన్స్ కట్టలేకపోతున్నామని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని కోరారు.

## సమావేశాలకు సమాచారం ఇవ్వట్లేదు

- మండల సమావేశంలో సభ్యుల ఆగ్రహం
- పలువురి ప్రజాప్రతినిధుల గైర్హాజర్

అల్లాదుర్గం(మెదక్): సమావేశాలకు సమాచారం ఇవ్వట్లేదని మండల సమావేశంలో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రం అల్లాదుర్గంలో సర్వసభ్య సమావేశం శుక్రవారం ఎంపీపీ అనిల్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సమస్యలపై ప్రశ్నించే ప్రజాప్రతినిధులు రాలేదు. దీంతో మొక్కుబడిగానే సమావేశం కొనసాగింది. మండలంలో అభివృద్ధి పనులు, సమస్యలపై సర్వసభ్య సమావేశంలో చర్చించాల్సి ఉండగా అడిగే వారే లేరు. ఆయా శాఖల అధికారులు తమ ఏజెండాను చదివి వినిపించారు. మండలంలో 9 మంది ఎంపీటీసీలకు నలుగురు మాత్రమే హాజరయ్యారు. మండలంలో 16 మంది సర్పంచ్‌లు ఉండగా నలుగురు మాత్రమే సమావేశానికి వచ్చారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం ఎవరికి అందుతుందో, సమావేశాలకు సర్పంచ్‌లకు సమాచారం ఇవ్వడంలేదని సీతానగర్ సర్పంచ్ లక్ష్మయ్య అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసే అధికారం సర్పంచ్‌లకు ఉందని సూపర్‌వైజర్ నాగమణి చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శంకర్, పీఆర్ఏఈ విజయ్‌కుమార్, ఏఓ రాజేశ్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.


ఎంపీపీని ప్రశ్నిస్తున్న సర్పంచ్

## బ్యాంకు రుణాలు సద్వినియోగం చేసుకోండి



రుణాలపై అవగాహన కల్పిస్తున్న బ్యాంకు మేనేజర్ శోభన్‌బాబు

తూప్రాన్: ఎస్‌బీఐ బ్యాంకు ద్వారా అర్హులకు తక్కువ వడ్డీపై రుణాలు అందిస్తున్నామని తూప్రాన్ ఎస్‌బీఐ బ్యాంకు మేనేజర్ శోభన్‌బాబు పేర్కొన్నారు. శుక్రవారం బ్యాంకు ఆవరణలో ఖాతాదారులకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్నదాత దివాస్ కార్యక్రమంలో భాగంగా గ్రామీణ, పట్టణ ప్రాంత రైతులకు ముద్రలోన్, కోల్డ్ స్టోరేజ్, రైస్‌మిల్ ఏర్పాటుకు రుణాలు, మహిళా మండలి గ్రూపు సభ్యులకు సెక్యూరిటీ లేకుండా రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు స్వయం ఉపాధి కల్పించడానికి ఎస్‌బీఐ బ్యాంకు రుణాలు మంజూరు చేస్తున్నందని తెలిపారు. ఆసక్తిగల వారు బ్యాంకుకు వచ్చి తమ పేర్లు నమోదు చేసుకుంటే పరిశీలించి రుణాలు మంజూరు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ శాంతిప్రియ తదితరులు పాల్గొన్నారు.